## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే బాలూనాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

చందంపేట(దేవరకొండ), మే 3 : గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. శనివారం దేవరకొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 'ధర్తి ఆబ్ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకం దేశ వ్యాప్తంగా గిరిజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం తీసుకొచ్చిన సమగ్ర ప్రణాళిక అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.79.156 కోట్ల బడ్జెట్‌తో 25 రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా దేవరకొండ నియోజకవర్గంలో చేపట్టే కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. తండాలకు రోడ్లు, మినీ వాటర్ సప్లై ప్రాజెక్టులు, విద్యుత్ సౌకర్యం, ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలు, మొబైల్ యూనిట్లు, గిరిజన విద్యార్థుల కోసం హాస్టళ్లు, మోడల్ స్కూల్ డిజిటల్ లర్నింగ్, వెనుకబడిన చెంచుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి పథకం ఉద్దేశం వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, డీటీడీఓ చత్రునాయక్, ఏటీడీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ డానియల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రా నుంచి ధాన్యాన్ని తీసుకొస్తున్న లారీల పట్టివేత

- డీఎస్పీ రాజశేఖర్‌రాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, మే 3: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ధాన్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న 8 లారీలను పట్టుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని ఐకేపీ కేంద్రాల్లో సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ అందిస్తుండడంతో కొంతమంది బ్రోకర్లు ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి లారీల ద్వారా లారీల ద్వారా రాష్ట్రంలోకి తరలిస్తున్నారు. ఆంధ్రా నుంచి ధాన్యం రాకుండా నాగార్జున సాగర్ , వాడపల్లి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 20 రోజులుగా ఆంధ్రా నుంచి వస్తున్న సుమారు వందకు పైగా లారీలను పోలీసులు అడ్డుకొని తిప్పి పంపించారు. దాంతో బ్రోకర్లు మఠంపల్లి, దాచేపల్లిల మీదుగా అడ్డదారుల్లో ధాన్యాన్ని తీసుకొస్తున్నట్లు తెలియడంతో పహారా ఏర్పాటు చేసి 8 లారీలను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ లారీల్లో 2,200 బస్తాల ధాన్యం ఉన్నట్లు వెల్లడించారు. ఈ ధాన్యాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు, ఎవరి ద్వారా విక్రయిస్తున్నారనే వివరాలను నిందితులను విచారించిన తరువాత వెలుగులోకి వస్తాయన్నారు. ధాన్యం అక్రమ రవాణా చేస్తున్న బ్రోకర్లపై, లారీల యజమానులపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ పీఎండీ.ప్రసాద్, మిర్యాలగూడ, వాడపల్లి ఎస్ఐలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మునుగోడు, మే 2 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం మునుగోడు మండలంలోని కొరటికల్, పలివెల, కిష్టాపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి, శుభ్రం చేసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. దాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీయం మైసేశ్వరావు, సీసీలు శ్రీనివాస్, శంకర్, మల్లేశ్వరి, వీఓఏలు ఉన్నారు.

## 'పది' పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాజు

చిట్యాల,మే3 : పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన మండలంలోని గుండ్రాంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులను శనివారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. 500కు పైగా మార్కులు సాధించిన కంకల శిరీష, అన్నబోయిన సంజన, బందారపు అక్షిత, అబ్దుల్ ఖాజా ఖదీర్, బల్గూరి మోక్షితను శాలువాతో సత్కరించి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరెడ్ల వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం

- ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్



జెండా ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్

చందంపేట(దేవరకొండ), మే 3 : రాష్ట్రంలో ప్రజలకు విద్య, వైద్యం, యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ విమర్శించారు. సంఘం 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవనంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐవైఎఫ్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మహేశ్, ఆంజనేయులు, గణేశ్, జంగయ్య, శ్రీను, పాండు, జాకీర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**CHANGE OF NAME**
I, EDUKULLA SHARADHA, D/o. Laxmaiah, (old Name) R/o. H.No. 6-71, BC Colony, Kondamallepally (V) (M), Nalgonda (Dist), I have changed my name as M.SHARADA, alyas MUNAGAPATI SHARADA, W/o. EDUKULLA RAJENDAR (New Name) for all Future purposes.

**FINANCIAL SERVICES**
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

**PLOT FOR SALE**
★హయత్ నగర్, కుంట్లూర్ 200 గ॥, పసుమాముల 300 గ॥, లస్కర్‌గూడ 200 గ॥ ప్లాట్లు అమ్మకానికి కలవు (నో బ్రోకర్స్). 9390189907.
NT-331095

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059
మిర్యాలగూడ: 9182777059

## నిలిచిన కాంటాలు.. ఆందోళనలో రైతులు

- పోలేపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం
- మాయిశ్చర్ రావడం లేదని, హమాలీల కొరతతో కాంటా వేయని నిర్వాహకులు
- అకాల వర్షాలతో ఆందోళనకు గురవుతున్న రైతులు



పోలేపల్లి కేంద్రంలో ధాన్యాన్ని పట్టాలతో కప్పి ఉంచుకున్న రైతులు

చందంపేట, మే 3 : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటను అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. చందంపేట మండలంలోని పోలేపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మండలంలోని చిత్రియాల, పెద్దమూల, రేకులగడ్డ, యాపలపాయతండా, కంబాలపల్లి, దేవరచర్ల, యల్మలమంద, ముర్పునూతల గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు వడ్లను తీసుకు వచ్చారు. అయితే మాయిశ్చర్ రాలేదనే సాకుతో సుమారు 15 రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరితే హమాలీలు లేరని, లారీలు రాలేదని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కేంద్రంలో సుమారు 10వేల క్వింటాళ్ల వడ్లు ఉండగా వాటిని కొనుగోలు చేయాల్సి ఉంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అకాల వర్షాలతో ఆందోళన

వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ ధాన్యాన్ని తీసుకొచ్చి పోలేపల్లి కొనుగోలు కేంద్రంలో పోశారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దానికి తోడు ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి రోజు రైతులు సాయంత్రం కాగానే ధాన్యం కుప్పలపై పట్టాలు కప్పుకోవడం, తిరిగి ఉదయం వాటిని తీసేసి ధాన్యాన్ని ఆరబెట్టడం పరిపాటిగా మారింది. రోజుల తరబడి ధాన్యం కుప్పలకు కాపలాగా ఉండలేక ఇబ్బందులు పడుతున్నామని, తమ గోస ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 12 రోజులైనా వడ్లు కొంటలేరు



నేను కొనుగోలు కేంద్రానికి వడ్లను తీసుకొచ్చి పదిహేను రోజులైంది. మ్యాచర్ రావడం లేదని చెప్పి వడ్లను కొనుగోలు చేస్తలేరు. వడ్లను బాగా ఎండబెట్టినా కూడా అమ్ముదామంటే లారీ ఉండదు.. లారీ ఉంటే హమాలీలు ఉండరు. బస్తాకు ఇంత అని కమిషన్ ఇస్తేనే వాహనాలు అందుబాటులో ఉంచుతున్నరు.

-కేతావత్ హేమ్లానాయక్, దేవరచర్ల

## నల్లగొండ జిల్లా ఐఎస్ఐ తీవ్రవాదుల అడ్డా

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

నల్లగొండ రూరల్, మే 3: నల్లగొండ జిల్లా ఐఎస్ఐ త్రీవాదుల అడ్డా అని, దేశంలో ఎక్కడ ఉగ్రవాద దాడులు జరిగినా మూలాలు నల్లగొండలోనే కనబడతాయని మెదక్ ఎంపీ రఘునందర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ శత జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నల్లగొండలో ఓ వైపు ఐఎస్ఐ ఉగ్రవాదం, మరో వైపు వామపక్ష తీవ్రవాదం ఉండి.. బీజేపీ ఎదుగుదలను అడ్డుకుంటున్నాయని అన్నా రు. కశ్మీర్‌లోని పహల్గాం ఘటన తర్వాత భారత్‌లో ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశీయులను వారి దేశాలకుపంపాలని కేంద్రం ఆదేశాలిచ్చిందని, అయిన తెలంగాణ ప్రభుత్వానికి సోయి లేదని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగక రైతులు అరిగోస పడుతున్నారని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో కూరుకు పోయిన ఉద్యోగుల మృతదేహాలను కూడా బయటకి తీయలేని చేతకాని ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు.

## లేబర్ కోడ్‌ల రద్దు కోసం 20న దేశవ్యాప్త సమ్మె



అధికారికి సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ సిటీ, మే 3 : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని నిరసిస్తూ ఈ నెల 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ)జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం జిల్లా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ కార్యాలయ ఏఓకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రవాణా రంగంలో 12 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా, పెన్షన్, ఆరోగ్యబీమా అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రవాణా రంగాన్ని బడా కార్పొరేట్ పెట్టుబడి దారులకు అప్పగించాలని చూస్తున్నదని పేర్కొన్నారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెంజర్ల సైదులు, నాయకులు అద్దంకి నరసింహ, నవీన్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను సజావుగా చేపట్టాలి

- డీసీఓ వెంకటేశ్



శివన్నగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ వెంకటేశ్

మర్రిగూడ, మే 3 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా చేపట్టాలని డీసీఓ వెంకటేశ్ అధికారులను సూచించారు. శనివారం మండలంలోని శివన్నగూడెంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోస పోవద్దని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ బక్క శ్రీనివాసులు, సీఈఓ మధూకర్, అధికారులు ఉన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న కోడి శ్రీనివాసులు

చండూరు, మే 3: గాంధీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఒక్కో కుటుంబానికి రూ. వెయ్యి విలువైన సరుకులు అందిస్తున్నట్లు చెప్పారు. ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కోడి అరుణ, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కోడి ప్రీతి, కోడి శృతి, జెల్లా వివేక్, ధీరజ్, బోడ యాదయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్‌గోపి పాల్గొన్నారు.

## అరుణాచల గిరి ప్రదర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నల్లగొండ సిటీ, మే 3 : అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు సంస్థ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు తమిళనాడులోని అరుణాచలానికి బయల్దేరుతాయని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో ప్రయాణించే వారికి ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడులోని వేలూరు గోల్డెన్‌టెంపుల్ దర్శనం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9298008888 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి : కలెక్టర్

నీలగిరి, మే 3 : వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్యశాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవున్న దృష్ట్యా మధ్యాహ్నం సమయంలో ఇంట్లోంచి బయటకు వెళ్లకుండా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, రుమాలు చుట్టుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఎండలో తిరగవద్దని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు జాగ్రత్తగా పాటించాలని, ఉపాధిహామీ కూలీలు ఉదయం వేళల్లో పనులు చేసేలా చూడాలని సూచించారు. పని ప్రదేశాల్లో నీడకోసం శామియాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

## యువకుడు ఆత్మహత్యా యత్నం

- కాపాడిన 108 సిబ్బంది

దామరచర్ల, మే 3: మండల కేంద్రంలో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా 108 సిబ్బంది కాపాడారు. 108 సిబ్బంది శ్రీనివాస్, సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన భూక్య చిన్నా కుటుంబ కలహాలతో శనివారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్ సమీపంలో పురుగుల మందు తాగాడు. అనంతరం భయపడి 108కు ఫోన్ చేసి తనను కాపాడాలని వేడుకున్నాడు. వెంటనే 108 సిబ్బంది అప్రమత్తమై చిన్నా చెప్పిన ప్రదేశానికి వెళ్లి చూడగా అతను కనిపించలేదు. కొంత సేపు పరిసర ప్రాంతాల్లో గాలించగా రైల్వేట్రాక్ సమీపంలో చెట్టు కింద అతను పడి ఉన్నాడు. వెంటనే అతడిని వాహనంలో చికిత్స నమిత్తం మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : సీపీఎం

పెద్దవూర, మే 3: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత, లారీలు సకాలంలో రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దానికి తోడు క్వింటాకు రెండు కేజీల తరుగు తీస్తూ నిర్వాహకులు రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస వసతులు కల్పించాలని కోరారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, నాయకులు మల్లయ్య, రామకృష్ణ ఉన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుర్రంపోడు, మే 3: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన కొండమీది అశోక్(40) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంగ యాదయ్య ఇంటి సర్వీస్ వైర్ శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు తెగిపడింది. శనివారం ఉదయం గ్రామానికి చెందిన అశోక్ దానిని సరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని హుటాహుటిన దేవరకొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## అకాల వర్షంతో రైతులకు నష్టం



తిరుమలగిరి సాగర్ ఐకేపీ కేంద్రంలో ధాన్యం బస్తాల వద్ద నిలిచిన వర్షం నీరు

తిరుమలగిరి(సాగర్), మే 3: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దాంతో మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులోని ఐకేపీ కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు, ధాన్యంతో నింపిన బస్తాలు పూర్తిగా తడిశాయి. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి బస్తాల్లో నింపిన కేంద్రం నిర్వాహకులు లారీల కొరత కారణంగా వాటిని మిల్లులకు తరలించకుండా కేంద్రంలోని ఉంచారు. వర్షానికి బస్తాల్లోని ధాన్యం తడవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. కేంద్రం నిర్వాహకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### హాలియాలో వర్షం

హాలియా : మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో హాలియాలోని పలు ఇండ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌పై ఉన్న సైన్ బోర్డు ఈదురు గాలి ధాటికి కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగడంతో పట్టణంలో సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచింది.

## మాజీ ఉపసర్పంచ్‌కు భాస్కర్‌రావు పరామర్శ



అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

దామరచర్ల, మే 3: దామరచర్ల మాజీ ఉపసర్పంచ్ కొండారపు వీరసైదులు సతీమణి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న భాస్కర్‌రావు శనివారం దామరచర్లకు వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కె.వీరకోటిరెడ్డి, ఆంగోతు హతీరాంనాయక్, సోము సైదిరెడ్డి, బాల సత్యనారాయణ, కందుల నాగిరెడ్డి, జి.వీరబాబు, రఫీ, విష్ణు, అనిల్‌నాయక్ పాల్గొన్నారు.

## రవీందర్ కుటుంబానికి చిరుమర్తి పరామర్శ



రవీందర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల, మే 3 : మండలంలోని మొగిలిదొరి గ్రామానికి చెందిన బొమ్మగోని రవీందర్ (41) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామానికి చెందిన జై శ్రీమన్నారాయణ లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ తరుపున రవీందర్ కుటుంబానికి రూ.1.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో తాళ్ల వెల్లంల మాజీ ఎంపీటీసీ జనగాం రవీందర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, నాయకులు బోయపల్లి శ్రీను, గుత్తా శ్రీనివాస్‌రెడ్డి, బషీర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## వెనిగండ్లలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం

నిడమనూరు, మే 3 : నిడమనూరు మండలం వెనిగండ్ల గ్రామంలో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు యడవల్లి వల్లపురెడ్డి, ముంగి శివమారెయ్య, మట్టారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కోపోప్పు లు స్వర్ణలత, పోలే రవి, స్థానికులు పాల్గొన్నారు.

## గీత సంఘాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర

- కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు జానయ్యగౌడ్

నకిరేకల్, మే 3 : సజావుగా సాగుతున్న గీత సంఘాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని, తనపై చేస్తున్న ఆరోపణలు నిరూపించేందుకు ఈ నెల 4న ఇందిరాగాంధీ సెంటర్‌లో బహిరంగ చర్చకు రావాలని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ సవాల్ విసిరారు. నకిరేకల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గీత సంఘంలో అవినీతికి పాల్పడుతున్నట్లు కొంత మంది కరపత్రాలు పంపిణీ చేస్తూ ఈ నెల 5న జరిగే సంఘం ఎన్నికల్లో తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సదరు అభ్యర్థులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా సహాయ అధికారి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ అభ్యర్థులు కొండ యాదగిరి, కొండ శ్రీను, చెనగోని రవి, చౌగోని వెంకన్న, భూపతి వెంకటనారాయణ, కొండ అచ్చమ్మ, నర్సింగ్ సుగుణమ్మ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం, మే 3 : మండల కేంద్రంలోని విజ్ఞానజ్యోతి హైస్కూల్‌లో 2008–09 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం మండల కేం ద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనం గా సన్మానించారు. కార్యక్రమం లో హెచ్‌ఎం బుడిగె శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొయ్యడ శివశంకర్, పడాల అంతయ్య, సుబ్రహ్మణ్యశర్మ, శశిధర్‌రెడ్డి,

ఖాజా మొహినొద్దీన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం ఎత్తుకెళ్లిన వారిపై కేసు

కేతేపల్లి, మే 3: ధాన్యం ఎత్తుకెళ్లిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎ.శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భీమారం గ్రామానికి చెందిన రైతులు గత నెలలో గ్రామ శివారులో ధాన్యాన్ని ఆరబెట్టిన అనంతరం రాశులుగా పోశారు. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన అన్నదమ్ములు సంపంగి ఐలయ్య, సంపంగి కరుణాకర్ రాత్రి సమయంలో సదరు ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడు చేసుకొని తీసుకెళ్లారు. ధాన్యాన్ని సూర్యాపేట వ్యవయసాయ మార్కెట్‌లో విక్రయించి సొమ్ముచేసుకున్నారు. ఈ విషయమై బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిందితులను పట్టుకొని కోర్టులో హాజరు పర్చారు.

### మరో కేసులో..

కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన చెరుకు రోషయ్య, సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన చందుపట్ల వెంకటరమణ అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన మంద విజయలక్ష్మి, చింతమళ్ల మమత వద్ద రూ.20 వేలు తీసుకొని మోసం చేసారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువురిని అరెస్టు చేసి కోర్టులో హారుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.